ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 12 ఏప్రిల్ 2024



» తేమ, తాలు లేకుండా ధాన్యం తేవాలని సూచన
» నేడు, రేపు జిల్లావ్యాప్తంగా రైతు వేదికల్లో సమావేశాలు
» ఏర్పాట్లు చేసిన వ్యవసాయ అధికారులు



మద్దతు ధర కోసం..

రైతులకు అవగాహన కార్యక్రమాలు

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధాన్యానికి మద్దతు ధర రావాలంటే రైతులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మార్కెట్ కమిటీల్లో ట్రేడర్లు, గ్రామాల్లో దళారుల వద్ద మోసపోకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ఈ నెల 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలోని 62 రైతు వేదికల్లో ఈ సమావేశాలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇందులో వడ్లను అమ్మకానికి ఏ విధంగా తీసుకురావాలి? ఏయే నిబంధనలు పాటించాలన్న అంశాలపై రైతులకు సూచనలు ఇస్తారు. రైతు వేదికల్లో ఏఈవోలు, ఏవోల ద్వారా రైతులకు సూచనలు అందిస్తారు.

కొనుగోళ్లపై ప్రభుత్వం దృష్టి

ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వానికి చెడ్డపేరు రావొద్దనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావొద్దని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో తరచుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు. కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, ధాన్యానికి తక్కువ ధర చెల్లించిన వారిపై కఠినంగా ఉండాలని ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు.

తేమ, తాలు లేకుండా చూడాలని..

రైతులు 'ఏ' గ్రేడ్ మద్దతు ధర రూ.2203 పొందాలంటే తేమ, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తెస్తే మంచి ధర పొందే అవకాశం ఉందంటున్నారు. ఇదే అంశాలపై రెండు రోజుల పాటు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ.2183 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించింది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు పరిశీలిస్తారు. 17 లోపు తేమ శాతం నమోదై తాలు లేకుండా ఉంటే 'ఏ'గ్రేడ్‌గా పరిగణిస్తారు. ఏ గ్రేడ్ రావడం కోసం రైతులు ధాన్యాన్ని ఆరబోసి, తూర్పార పట్టి కేంద్రాలకు తేవాలని అంటున్నారు.

గ్రామాల కూడళ్లలోనూ..

- రైతులకు అవగాహన కార్యక్రమాల సమాచారాన్ని చేరవేసేందుకు ఏఈవోలు ఆయా గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో సమాచారాన్ని పోస్టు చేశారు. దీంతో పాటు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా జీపీ కార్యదర్శులకు సమాచారం అందించి సమావేశాలకు సంబంధించి టామ్ టామ్ వేయించాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో పలు రైతువేదికలు గ్రామానికి దూరంగా ఉన్నాయి. ఒకవేళ రైతు వేదికలకు రావడానికి రైతులు ఇబ్బంది పడితే గ్రామ కూడళ్లలో ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మార్కెట్ ఘటనపై సీఎం సీరియస్

జనగామ మార్కెట్‌లో బుధవారం జరిగిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. అధికారులు ఎవరైనా వ్యాపారులతో కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని తక్కువ ధర చెల్లించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతులకు ధాన్యానికి రూ.1551 చొప్పున చెల్లించడంపై ఆయన ఫైర్ అయ్యారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను జోడించి 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. కొనుగోళ్ల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఘటనపై సకాలంలో స్పందించి నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని, మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను ఆయన 'ఎక్స్' వేదికగా అభినందించారు.

ముగ్గురు ట్రేడర్లపై కేసు నమోదు..

మార్కెట్ కార్యదర్శిపై నివేదిక

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని తక్కువ ధరకు కొనడానికి ప్రయత్నించిన ముగ్గురు ట్రేడర్లపై జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. మార్కెట్‌లో బుధవారం ధాన్యానికి క్వింటాకు రూ.1551 చొప్పున పలువురు ట్రేడర్లు ధర నిర్ణయించారు. దీనిపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ట్రేడర్లపై క్రిమినల్ కేసులు, మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరి వెంకటనారాయణ (వీఎన్ ట్రేడర్స్), దాన ఉషారాణి(ఉమా ట్రేడర్స్), కందుకూరి సుజాత(పరమేశ్వర ట్రేడర్స్)పై కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. కాగా.. జనగామ మార్కెట్ ఘటనపై ముగ్గురు ట్రేడర్లకు షోకాజ్ నోటీసులు సైతం అధికారులు జారీ చేశారు. తక్కువ ధరకు కొనడానికి ప్రయత్నించినందున వారి లైసెన్సులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా.. ట్రేడర్లతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణల్లో ఎంత వరకు నిజమనే అంశంపై నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి జనగామ జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్రను నివేదిక కోరారు. ఈ అంశంపై ప్రాథమికంగా విచారణ జరిపిన అనంతరం ఆయన పాత్రపై స్పష్టత వస్తుందని, దానిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని నరేంద్ర తెలిపారు.

మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

జనగామ మార్కెట్ ఆవరణలోని కాటన్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు గురువారం ప్రారంభించారు. మార్కెట్‌లో ట్రేడర్లు రైతులకు తక్కువ ధర చెల్లిస్తుండడంతో బుధవారం నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మార్కెట్‌లోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. కేంద్రం ప్రారంభంలో సివిల్ సప్లయిస్ అధికారిణి రోజారాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అవే ధరలు!

10వ తేదీ ధర కంటే క్వింటాకు రూ.30 మాత్రమే అదనం

వర్షాల భయంతో గత్యంతరం లేక అమ్ముకుంటున్న రైతులు



జనగామ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి తక్కువ ధర ఇవ్వడంపై ఓ వైపు ప్రభుత్వం సీరియస్ అయినప్పటికీ మరోవైపు వ్యాపారులు అవే ధరలకు మళ్లీ కొంటున్నారు. రైతులకు బుధవారం నిర్ణయించిన ధరల కంటే క్వింటాకు రూ. 30 చొప్పున ఎక్కువ ఇస్తామంటూ ట్రేడర్లు ముందుకొచ్చారు. దీంతో రైతులు ధాన్యాన్ని (క్వింటాకు రూ.1530 నుంచి రూ.1889లోపు) అమ్మేందుకు మొగ్గు చూపారు. వర్షాల భయంతో గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. జనగామ మార్కెట్‌లో బుధవారం నిరసన తెలిపిన రైతుల్లో చాలా మంది ఈ ధరకు అంగీకరించి ట్రేడర్లకు ధాన్యాన్ని విక్రయించారు. తేమ లేకుండా, తాలు లేకుండా అమ్మితే రూ.2203 ఇప్పిస్తామని అధికారులు చెప్పినప్పటికీ కొందరు రైతులు ట్రేడర్లకే అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం 17 వచ్చి, తాలు లేకపోతేనే రూ.2203 ధర ఇస్తారు. దీని కోసం వడ్లను ఆరబోసి, తూర్పార పట్టాల్సి ఉంటుంది. ఇదంతా చేయడానికి రైతులకు రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. కానీ.. ఇదంతా చేయడానికి కొందరు రైతులు సిద్ధంగా లేరు. ఈ లోపు వర్షం వస్తే ధాన్యం అంతా తడిసిపోతుందనే ఉద్దేశంతో వ్యాపారులకు అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. జనగామ మార్కెట్‌లో బుధవారం తక్కువ ధర అంటూ రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ రైతుల ధాన్యాన్ని గురువారం పరిశీలించగా తేమ శాతం 30-35 మధ్య నమోదైంది. దీంతో బుధవారం కంటే క్వింటాకు రూ.30 చొప్పున అధికంగా తీసుకొంటూ ధాన్యాన్ని అమ్మారు. కాగా.. రైతులు తమ ఇష్టపూర్వకంగానే క్వింటాకు అదనంగా రూ.30 చొప్పున తీసుకొని ధాన్యాన్ని విక్రయిస్తున్నారని జిల్లా మార్కెటింగ్ మేనేజరు నరేంద్ర తెలిపారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ధర విషయంలో ట్రేడర్లు, రైతులు, అడ్తిదారులు, హమాలీలతో గురువారం ఉదయం సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తిరిగి బిడ్డింగ్ నిర్వహిస్తే ధరల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉండడంతో మొత్తంగా ప్రతీ రైతుకు క్వింటాకు రూ.30 చొప్పున అదనంగా చెల్లించేందుకు ట్రేడర్లు ముందుకొచ్చారని, దీనికి రైతులకు కూడా అంగీకరించి కాంటా పెట్టించారని తెలిపారు.

రైతులను దోపిడీ చేస్తున్న అధికారులు, ట్రేడర్లు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జనగామ మార్కెట్‌లో రైతులను మార్కెట్ అధికారులు, ట్రేడర్లు కలిసి దోపిడీ చేస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జనగామ మార్కెట్‌ను గురువారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాల భయంతో రైతులు ఆదరబాదరగా ధాన్యాన్ని తీసుకొస్తే తేమ శాతం, తాలు పేరుతో దోచుకోవడం సరికాదన్నారు. తమ ప్రభుత్వంలో తేమ శాతం అధికంగా ఉన్నప్పటికీ రూ.1800 పైన ధర పెట్టి కొనుగోలు చేశామన్నారు. రైతులకు ట్రేడర్లు అన్యాయం చేస్తుంటే చెప్పాల్సింది పోయి అధికారులే సహకరిస్తున్నారని మండిపడ్డారు. తేమశాతం ఉంటే రూ.100, రూ.200 తక్కువకు కొనాల్సింది పోయి ఏకంగా రూ. 700 వందల తేడాతో కొనడం ఏంటని ప్రశ్నించారు. రైతులకు బిచ్చం వేసినట్లుగా ధర నిర్ణయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. రైతులకు మద్దతుగా తాను ఉంటానని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు బాల్దె సిద్ధిలింగం తదితరులు ఉన్నారు.

దేశంలోని అవినీతిపరులంతా..
ఉన్నది బీజేపీలోనే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు

న్యూశాయంపేట, ఏప్రిల్ 11: దేశంలోని అవినీతిపరులంతా బీజేపీలోనే ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయహోటల్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. రాజ్యాంగం రక్షింపబడాలన్నా.. ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలన్నా.. కేంద్రంలో బీజేపీని సాగనంపాలన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న అవినీతి రాజకీయ నాయకులందరినీ ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించి వారిని లొంగదీసుకుని బీజేపీలోకి చేర్చుకుని క్లీన్‌చీట్ ఇస్తున్నారన్నారు. వీటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రామాలయం, సీఏఏ, హిందుత్వం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని, దళిత వ్యతిరేక పార్టీ అయిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. బీజేపీ కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే ఉన్న రిజర్వేషన్లు ఎత్తివేయడం ఖాయమని, అలాంటి పెత్తందారుల పార్టీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం తగదన్నారు. బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు పదేళ్లలో నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని, విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు నెరవేర్చలేదన్నారు. విద్యుత్‌ను కూడా ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని, రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని శ్రీనివాసరావు కోరారు.

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించలేకనే మతోన్మాద ఎజెండా ఎత్తుకుందన్నారు. కేంద్రంలోని బీజేపీ విధానాలను రాష్ట్రంలోని బీఆర్ఎస్ కూడా అనుసరించుకుంటూ వచ్చిందన్నారు. ఇలాంటి బీజేపీ, బీఆర్ఎస్ బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను కూడగట్టి ముందుకుసాగాలన్నారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, సీపీఎం, ఎంసీపీఐ(యు), ఆర్ఎస్పీ, న్యూడెమోక్రసీ నాయకులు ఎం. చుక్కయ్య, కె.శివాజీ, ఆర్. బాలరాజుతో పాటు సీపీఎం ఎంఎల్, ఆర్ఎస్పీ, మాస్‌లైన్, లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నాన్నపై గొడ్డలితో దాడి

భూ వివాదాలే కారణం ● సిరిపురంలో ఘటన

లింగాలఘణపురం, ఏప్రిల్ 11: భూ వివాదాలు కుటుంబ సభ్యుల మధ్య దాడికి దారితీశాయి. క్షణికావేశంలో సొంత చిన్నాన్నపైనే అన్న కొడుకు గొడ్డలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. లింగాలఘణపురం మండలం సిరిపురం గ్రామానికి చెందిన వేముల కృష్ణారెడ్డికి.. తన అన్న కొడుకైన నవీన్‌రెడ్డికి మధ్య కొంత కాలంగా భూ తగాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న నవీన్‌రెడ్డి పథకం ప్రకారం బుధవారం రాత్రి కృష్ణారెడ్డిపై గొడ్డలితో దాడి చేశాడు. స్థానికులు గమనించి అతడిని అడ్డుకొని కృష్ణారెడ్డిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు



జనగామలోని ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని ఈద్గాలు, మజీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నా పెద్దా కలిసి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. 30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు రంజాన్‌తో ఉపవాస దీక్షలు ముగించారు. జిల్లాకేంద్రంలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న ఈద్గాలో ముస్లింలు పెద్ద సంఖ్యలో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈద్గా దగ్గరకు వచ్చిన పేదలకు దానధర్మాలు చేశారు. ప్రార్థనల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు పల్లాను సన్మానించారు.

బడుగుల చైతన్య దీప్తి జ్యోతిరావు పూలే

జయంతి వేడుకల్లో కొనియాడిన వక్తలు



జనగామ అంబేద్కర్ చౌరస్తాలో పూలే జయంతిలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అణగారిన వర్గాల ప్రజలకు జ్యోతిరావ్‌పూలే ఓ చైతన్య దీప్తి అని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయం లో జ్యోతిరావ్‌పూలే 197 జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. సంఘసంస్కర్తగా, సమాజ అభివృద్ధి కోసం పూలే ఎంతో కృషి చేశారన్నారు. విద్యతోనే సమాజంలో చైతన్యం వస్తుందని, బాలికల, మహిళల విద్యతోనే సమసమాజ స్థాపన జరుగుతుందని ఆయన భావించారన్నారు. పూలే అడుగు జాడల్లో అందరూ నడవాలని కోరారు. జయంతి కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, జిల్లా అధికారులు రోజారాణి, ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతిని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. నిరాదరణకు గురైన జాతులను పూలే తట్టి లేపారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీహరి, కనకయ్య, జంపయ్య, గోవర్ధన్‌రెడ్డి, రవీందర్, దామోదర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

పూలే జయంతిని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గద్దల కిశోర్, పైస రాజశేఖర్ మాట్లాడుతూ.. వివక్షకు వ్యతిరేకంగా పూలే పోరాటాలు చేశారని అన్నారు. స్త్రీలకు, నిమ్న వర్గాలకు పాఠశాలలను స్థాపించి విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సందెన రవీందర్, భాస్కర్, బొట్ల మహేశ్, ఉదయ్‌కిరణ్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళోద్ధరణకు పూలే కృషి..

అంటరానితనం, కుల నిర్మూలనతో పాటు మహిళోదర్ధరణకు జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశరామ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ప్రజలు, మహిళలకు విద్యను అందించేందుకు పూలే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల శ్రీనివాస్, మల్లిగారి రాజు, మంద రమేశ్, తిప్పారపు విజయ్, తిప్పారపు ఉపేందర్, నీలం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

» ఇద్దరం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం..
» వరంగల్ కోసం మోదీ ఎంతో చేశారు
» మాల, మాదిగలను అణగదొక్కిన కడియం
» కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం? ఆమె మెట్టినిల్లు గుంటూరు
» హామీలు నెరవేర్చని కాంగ్రెస్
» బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు సీతారామ్‌నాయక్, అరూరి రమేష్
» బీజేపీలోకి పెద్ద ఎత్తున చేరికలు

7లో..



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, పక్కన మానుకోట అభ్యర్థి సీతారాంనాయక్, గరికపాటి మోహన్‌రావు

ధాన్యం కొనుగోళ్లు బంద్ చేయాలి

మార్కెట్ కార్యదర్శికి ట్రేడర్ల వినతి

కొనుగోళ్లలో అక్రమాలను సహించబోం

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

వివరాలు 8లో..



‘ఖజానా’లో పని భారం

100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనికి 45మందే దిక్కు

35వేల పై చిలుకు ఉద్యోగులకు ఇక్కడినుంచే జీతాలు చెల్లింపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 11: హైదరాబాద్ ఖజానా కార్యాలయం తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఖజానా కార్యాలయమైన హనుమకొండ జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడి కార్యాలయంలో 100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనిని.. 45 మంది ఉద్యోగులే చేస్తూ అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆరు జిల్లాల ఖాజానా కార్యాలయాలలో 5 జిల్లాల ఖజానా కార్యాలయాల ఉద్యోగులు చేసే పనిని ఒక్క హనుమకొండ జిల్లా కార్యాలయ ఉద్యోగులు చేస్తున్నారంటే వారిపై ఎంత పనిభారం ఉందో అర్థమవుతోంది.

అన్నీ నుంచే..

జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఈ కార్యాలయం నుంచే ఇస్తారు. 15వేల మంది ఉద్యోగస్థులకు, 16వేల మంది పెన్షనర్లకు, 1200 మంది హోంగార్డులకు, 1500 మంది మున్సిపల్ సిబ్బందికి, 1000 మంది గ్రాంటినేట్ స్కూల్ టీచర్లకు, 500 మంది అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు(35వేల పైచిలుకు ఉద్యోగులకు) ఇక్కడి నుంచే చెల్లిస్తారు. దీంతో పాటు జిల్లాలోని 110 గ్రామ పంచాయతీల సిబ్బందికి వేతనాలతో పాటు సాధారణ నిధులు కూడా ఇక్కడి నుంచే విడుదలవుతాయి.

అన్ని రోజులూ పనిదినాలే...

ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో ఆదివారాలు, పండగ రోజులు కూడా ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. నూతన పెన్షన్ విధానం, ఆదాయ పన్ను రిటర్న్‌కు సంబంధించిన పనులు, క్యాష్ ఇన్ జీపీఎఫ్ చెల్లింపులు కూడా ఇక్కడి నుంచే చేస్తుండటంతో ఎక్కువ పనిభారంతో సతమతమవుతున్నామని ఖజానా కార్యాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖజానా కార్యాలయంలో సరిపడా ఉద్యోగులను కేటాయించాలని కోరుతున్నారు.

పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి



హనుమకొండ జిల్లాలో 16వేల మంది పెన్షనర్లు ప్రతీ నెల పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో పెన్షనర్లకు ఇబ్బంది ఎదురవుతోంది. ఖజానా కార్యాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గాలంటే పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇలాంటి ఆఫీస్‌లు హైదరాబాద్‌లో మాత్రమే ఉన్నాయి. హైదరాబాద్ తర్వాత ఎక్కువ పెన్షనర్లు ఉన్న మన హనుమకొండ జిల్లాలో కూడా పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

ఓటు అమ్ముకుంటే ఐదేళ్లు అధోగతే..

జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 11 : నోటుకు ఓటు అమ్మకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతేనని జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికి ఉన్నా శవంతో సమానమన్నారు. ధన రాజకీయాలకు ఎన్నికల్లో సమాధి కట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత ఓటర్ల పైనే ఉందని చెప్పారు. సమావేశంలో జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, రాష్ట్ర నేత ఖదిజ్ఞాసి వీరయ్య, సాంబశివ రావు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దు..

రామాలయ అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు ఆత్మహత్యాయత్నం



మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దని తీర్మానం చేస్తున్న ఈవో, చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు

మడికొండ, ఏప్రిల్ 11: మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఆలయంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీంపంలో ఉన్న కొందరు గమనించి వారించి నచ్చజెప్పి ఈవోకు సమాచారం అందించారు. కాగా, మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలకి సంబంధించిన రెండు కమిటీలు ఉంటాయి. ప్రస్తుతం రామాలయానికి సంబంధించిన భూమిని రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ఎనకు అమ్మగా కోట్ల రూపాయల నిధులు వచ్చాయి. ఆ నిధులపై కన్నేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఈవో, శివాలయం అర్చకులు, చైర్మన్‌లు.. రామాలయం, శివాలయం రెండింటినీ విలీనం చేసి నిధులను ఇతర అవసరాలకు మళ్లించేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఆలయాలను విలీనం చేయవద్దని నిరసన వ్యక్తం చేస్తూ అర్చకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

దీనిపై ఈవో శేషభారతి ఆలయ చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, స్థానికులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రస్తుతానికి ఆలయాల విలీనం వంటి చర్యలు ఏవీ చేయడంలేదని తీర్మానం చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే రామాలయ అర్చకులకు పే స్కేల్ వచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, ధర్మకర్తలు, కరుణాకర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానం!

దశాబ్దాలుగా నెరవేరని గగన విహారం ● భూసేకరణ, 150కి.మీ నిబంధనల అడ్డంకి దాటితేనే మార్గం సుగమం

వరంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓరుగల్లు వాసులకు 'విమానం' ఊరిస్తోంది. గగన విహారం కలగానే మిగులుతోంది. చిన్న నగరాలకు రాష్ట్ర రాజధానులు, ఢిల్లీతో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం ఉత్తుత్తిగానే మిగిలిపోతోంది. అయితే ఉమ్మడివరంగల్ జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకంగా ఉంటుందన్న లక్ష్యంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు 2021లోనే ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయంగా అనుమతులిచ్చింది. అయితే ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణతో పాటు హైదరాబాద్ విమానాశ్రయానికి 150కిలో మీటర్ల పరిధిలో మరో విమానశ్రాయం నిర్మించవద్దనే ఒప్పందం వరంగల్ ఎయిర్‌పోర్టుకు శాపంగా మారుతుంది. అయితే తాజాగా వారం రోజులుగా మామునూరు ఎయిర్‌పోర్టులో విమానాలు సందడి చేస్తున్నాయి. మూడు సర్వే విమానాలు మామునూరు రన్‌వేపై దిగటంతో విమానశ్రాయం కల సాకారమవబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

నిజాంకాలం నుంచే ఎయిర్‌పోర్టు..

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ విమానాలు ఎగిరిన మామునూరులో.. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండాపోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌ఆలీ ఖాన్ మామునూరులో విమానాశ్రయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, ఆజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం సందర్భంగా ఢిల్లీలో విమానాలు దిగే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. ఇలాంటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయాన్ని బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. 2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద దేశవ్యాప్తంగా విమానాశ్రాయాలను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఓఎల్ఎస్ సర్వే, మట్టి పరీక్షతో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గతేడాది జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి.

భూసేకరణ, 150కి.మీ నిబంధనే అడ్డంకి..

'అంగట్లో అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని' అనే చందంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులున్న భూసేకరణ, 150కిలో మీటర్ల నిబంధన ప్రతిబంధకంగా మారింది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. ఇందులో 435ఎకరాల భూమిని టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ క్యాంపునకు కేటాయించారు. ఇందులో నుంచే జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి పదెకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు కేటాయించారు. ఇక ఫోర్త్ బెటాలియన్‌కు మిగిలింది కేవలం 241.24ఎకరాలు. మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్లు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696 ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం. ఇంకా 504ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాల్సి ఉంది. 2023 జూలై నెలలో 249 ఎకరాలు వెటర్నరీ యూనివర్సిటీ పక్కనే ఉన్న భూమి సేకరించి ఎయిర్‌పోర్టుకు ఇచ్చేందుకు గత ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. మిగతా భూమిని చుట్టపక్కల గ్రామాల నుంచి రైతుల భూములు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూమిని అప్పగించేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. దీంతో విమానాశ్రయ ఏర్పాటుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పదం మేరకు 150కి.మీ నిడివిలో ఇంకో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 150కిలో మీటర్ల లోపే ఉంది. దీంతో 2038వరకు మామునూరు ఎయిర్‌పోర్టుకు మోక్షం లభించదనే నిరాశ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది. అయితే ప్రభుత్వం చొరవచూపించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, నిబంధనలను సడలించాలనే ప్రజలు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకునే వారు లేరు.



ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూమి

ఆశలు రేకెత్తిస్తున్న విమానాల సందడి..

మామునూరు ఎయిర్‌పోర్టులో గురువారం మూడు హెలికాప్టర్లు సందడి చేశాయి. వారం రోజులుగా ఒకటి రెండు విమానాలు మామునూరు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావటం, గగన విహారం చేయటం జరుగుతోంది. అయితే వాటిని ఎన్‌సీసీ విభాగానికి చెందిన హెలికాప్టర్లుగా భావించగా.. గురువారం మూడు హెలికాప్టర్లు ఒకేసారి మామునూరులో ల్యాండ్ కావటంతో పాటు స్కై సర్వే చేపట్టారు. మూడు హెలికాప్టర్లలో వచ్చిన సిబ్బంది జియోజికల్ సర్వే చేపట్టినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. ఏఏఐ అనుమతితో కొన్ని విమాన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇక్కడ ల్యాండింగ్‌కు ఉన్న వెసులుబాటును పరిశీలించారు. ఇప్పటికే మామునూరులో 6.6కి.మీ రన్‌వేతో పాటు పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 700 ఎకరాల వరకు భూమి ఉంది. వీటిని పరిశీలించిన అధికారులు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రదేశాన్ని కూడా ఎయిర్ వ్యూ చేశారు. అనంతరం మామునూరుకు చేరుకున్నారు. మరో రెండుమూడు రోజులు ఇతర సర్వేలు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఈ సర్వేలు ఎందుకోసమో వివరించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర విమానాయ శాఖ ఆదేశాల మేరకే ఈ సర్వేలు జరుగుతుండటంతో ఓరుగల్లువాసుల్లో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి.

విమానయానంతో వ్యాపారాభివృద్ధి...

విమానాశ్రాయం ఏర్పడితే వరంగల్‌లోపర్యాటకంతో పాటు వ్యాపారాభివృద్ధి జరుగనుంది. పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే పరిమితమవుతుండగా.. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌కు పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం ఎయిర్‌పోర్టు లేకపోవటమేనని తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే కారణంతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నా విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే ఢిల్లీ, హైదరాబద్‌తో ఎయిర్ కనెక్టీవిటీ లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టీవిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో అపార బొగ్గు నిక్షేపాలు ఉండగా.. ఇక్కడ బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా విమాన మార్గం లేకపోవటంతో పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జీఎంఆర్ సంస్థతో చర్చలు జరిపి మామునూరు ఎయిర్‌పోర్టుకు 150కి.మీ మినహాయింపు సడలించేలా ఒత్తిడి తెచ్చి, దశాబ్దాల కల సాకారం అయ్యేలా దృష్టిపెట్టాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

నేడు బీజేపీ లోక్‌సభ బూత్ స్థాయి సమ్మేళనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంను శుక్రవారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. ప్రతీ బూత్ నుంచి సమ్మేళనంలో పాల్గొని, విలువైన సలహాలు ఇచ్చి సీటు కైవసం చేసుకునేందుకు దోహదం చేయాలన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



కేయూ రోడ్డులో నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 11: బల్దియా పరిధిలో నిబంధనలు పాటిస్తేనే భవనాలకు అనుమతి పత్రాలు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల మంజూరు కోసం గురువారం నగరంలోని పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేయూ మెయిన్‌గేట్, పరిమళకాలనీ, ప్రకాశ్ రెడ్డిపేట, న్యూశాయంపేట, నక్కలగుట్ట ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. భవణాల నిర్మాణాల పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 11: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లో 33క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వంగపహాడ్ గ్రామంలో ఎం.కోమల, రమక్క అనే ఇద్దరు మహిళలు పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడిలో రూ.87వేల విలువైన 33 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు అజ్మీరా సీతారామ్‌నాయక్, అరూరి రమేష్



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని, ఆయన టీమ్‌లో తాము కూడా భాగస్వాములమయ్యే అవకాశాన్ని కలిగించాలని బీజేపీ లోక్‌సభ మహబూబాబాద్, వరంగల్ అభ్యర్థులు సీతారాం నాయక్, అరూరి రమేష్ ఓటర్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే ఇద్దరం కలిసికట్టుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం హనుమకొండలోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారామ్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేసిన తనను దూరంగా పెట్టి తెలంగాణ ద్రోహులకు టికెట్లిచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని మానుకోటకు తీసుకువచ్చిన రెడ్యానాయక్‌కు, ఆయన కూతురు కవితకు కేసీఆర్ టికెట్లిచ్చారన్నారు. అయినా కూడా తాను ఎంతో సహనంతో బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ చివరికి బయటకు వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారన్నారు. తాను ఎంపీగా మహబూబాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశానని చెప్పారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో, రామప్పకు యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ స్థానంలో ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు స్థాపనకు, ఇంకా ఇతరత్రా అనేక ప్రాజెక్టులు తీసుకురావడంలో ఎంతో కృషి చేశానని వివరించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకరవ్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా కేసీఆర్ అడ్డుపడ్డారన్నారు.

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన పలు దుర్మార్గపు విధానాల వల్లనే కాంగ్రెస్ గెలిచిందని, అంతేకానీ ఆ పార్టీ పట్ల ప్రజల్లో ప్రేమ ఉండి కాదని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఆనేక మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ప్రొఫెసర్ సీతారామ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తానని చెప్పిన వాగ్దానాల్లో ఒకటీ రెండు తప్ప.. ఏవీ అమలు కాలేదన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందన్నారు. రాష్ట్రంలో కరువుకు గురైన మండలాలను ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. దేశంలో సుస్థిర పాలన, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ఒక్క మోదీ వల్లనే సాధ్యమవుతుందని, ఆయనను చూసి ఓటేయ్యాలని సీతారామ్‌నాయక్ కోరారు. అయోధ్యలో రామమందిరం స్థాయిలో భద్రచాలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మోదీని లోక్‌సభ ఎన్నికల తర్వాత తీసుకువస్తానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలు బీజేపీ ఖాతాలో పడేలా ఓటర్లు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అభ్యర్థించారు.

వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతున్నారని, ఆయన టీమ్‌లోకి తనను, సీతారామ్ నాయక్‌ను పంపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేసిన తాను.. ఎమ్మెల్యేగా పదేళ్ల వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం వచ్చిందని, ఈ దృష్ట్యా ఓటర్లు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి మాల, మాదిగల ద్రోహిగా అరూరి అభివర్ణించారు. ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా టీడీపీలో, బీఆర్ఎస్‌లో పలు పదవులను అనుభవించినా ఎస్సీ సామాజికవర్గం అభ్యున్నతికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. తన సొంత లాభం కోసం ఆరాటపడ్డారన్నారు. ఇప్పుడు తన కూతురును రాజకీయాల్లోకి తీసుకురావడానికి అడ్డదారులు తొక్కాడని విమర్శించారు. కడియం కూతురు, ప్రస్తుతం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆమె అత్తగారు ఊరు గుంటూరని అన్నారు. శ్రీహరి కుటిల రాజకీయాలతో మాలలు, మాదిగలను ఆగం చేశాడన్నారు. లోకసభ ఎన్నికల్లో కడియంకు ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

ప్రస్తుతం యావత్ ప్రపంచం మోదీ వైపు చూస్తోందని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి, రక్షణకు మోదీ నాయకత్వం అవసరమని అరూరి రమేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ స్మార్ట్ సిటీ, అమృత్, గిరిజన విశ్వ విద్యాలయం, వ్యాగన్ వర్క్‌షాపు వంటి అనేక పథకాల ద్వారా వరంగల్‌కు ఎంతో చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీజేపీ మహబూబాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గరికెపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రావు అమరేందర్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల నుండి పలువురు బీజేపీలో చేరారు. వీరికి గరికపాటి మోహన్ రావు, ప్రొఫెసర్ సీతారామ్‌నాయక్, ఆరూరి రమేష్‌లు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు ములుగు జిల్లా రైతు బంధు అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పాలంపేట మాజీ సర్పంచ్ అకిరెడ్డి వెంకట రామ్మోన్ రావు, ఏటూరునాగారం మాజీ ఎంపీటీసీ ఇర్రల్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ ఏటూరు నాగారం కన్వీనర్ పల్ల బాబు, ఏటీఎంఏ డైరెక్టర్ పాపక శ్రీనివాస్‌తోపాటు పల్ల వెంకటేశ్వర్లు, పూజారి సూర్యనారాయణ, మధుకర్, నాగేశ్వర్‌రావు, పల్ల సృగన్, ఆకుతోట దుర్గయ్య తదితరులు వీరిలో ఉన్నారు. బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ములుగు జిల్లా ఇన్‌చార్జి పోలేపల్లి నరోత్తం రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ఒకవైపు విధులు.. మరో వైపు కళలు..

- వ్యాఖ్యాత, రచయిత, గాయకుడిగా ప్రవీణ్‌కుమార్ రాణింపు
- హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారిగా విధులు



జూలైవాడ, ఏప్రిల్ 11: సభలోని ఆహుతులను తన మాటలతో ఆకట్టుకొని, సందర్భోచిత కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపర్చడం వ్యాఖ్యాత విధి. సాహితీ, కళా ప్రక్రియలలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సౌరం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో బాలల పరిరక్షణ అధికారిగా (ఒప్పంద ప్రాతిపదికన) విధులు నిర్వహిస్తూ ప్రవృత్తి పరంగా కవిగా, రచయితగా, గాయకుడిగా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభను చాటుతున్నాడు.

చిన్ననాటి నుంచే కళారంగంపై ఆసక్తి

వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన సౌరం ప్రవీణ్‌కుమార్.. సంగెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించాడు. ఆ రోజుల్లోనే కళా రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ అనంతరం సోషల్ వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక చైతన్య గీతాలు పాడి ప్రముఖుల ప్రశంసలు పొందాడు.

పాటకు తొలి గురువులు

కళాశ్రీ ప్రవీణ్‌గా ద్వితీయ నామకరణంతో సాహితీ సాంస్కృతిక రంగంలో ఆరంగ్రేటం చేసిన ప్రవీణ్ కుమార్.. తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారి పాటలకు వంతపాడేవాడు. అనతికాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి అగ్రశ్రేణి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తనగళం వినిపించాడు. రచనా వ్యాసంగం వైపు దృష్టి మళ్లించి వర్ధమాన కవిగా, రచయితగా అనేక వేదికలపై తనను తాను నిరూపించుకున్నాడు. 2018 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమం అయినా, ఏదేని సాహితీ సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా కళాశ్రీ ప్రవీణ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఉన్నతాధికారుల సహకారంతో..

ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్తబండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులతో శభాష్ అనిపించుకొని అదే వేదికపై కణిక ఆత్మీయ పురస్కారం అందుకున్నాడు. ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



వివిధ కార్యక్రమాలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సౌరం ప్రవీణ్ కుమార్ (ఫైల్)

'కవి సాయంత్రం' ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక నరేన్



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 11: సాహిత్య స్వచ్ఛంద సేవా సంస్థ, జనజాగృతి కళా సమితిలో అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూప్ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీలో ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి రాధిక నరేన్‌ను నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కవి సాయంత్రం అనేది సాహిత్య సంస్థలో ఒక భాగమన్నారు. రాధిక నరేన్ కవయిత్రిగా, రచయితగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో ఆమెను నియామకం చేసినట్లు, ఈ నియామకం రెండేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం



పనులకు నిధులు లేక అవస్థలు

సొంత డబ్బుతో కొన్ని పనులకు వాడకం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 11: గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరుగుతోంది. అన్ని పనులు వారి మీదే పడుతుండడంతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనాటి నుంచి కార్యదర్శులకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది. ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలో రావాల్సిన పన్నులు అంతంత మాత్రమే వసూళ్లు అవుతుండటంతో అప్పులు చేయక తప్పడంలేదు. ప్రస్తుతం 56 రకాల రికార్డులను నిర్వహిసున్నప్పటికీ కార్యదర్శులకు అదనంగా వాటర్ సప్లయికి సంబంధించి 7 రికార్డులను అప్పజెప్పడంతో పని ఒత్తిడి తప్పడంలేదు.

రాష్ట్ర ఫైనాన్స్ నిధులు కట్

పంచాయతీ అభివృద్ధికి గ్రామంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ఫైనాన్స్ సెంట్రల్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంటులను వినియోగిస్తుంటారు. కాగా, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంతమాత్రమే కావడంతో షైనరు రిపేర్లు, పండుగల వేళ గ్రామంలోని దేవాలయాల ముస్తాబు, ఇతరత్రా ఖర్చులకే సరిపోతుంటుంది. మిగతా భారం అంతా సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నుంచే వచ్చే గ్రాంటులపైనే ఆధారం. గ్రామంలో ప్రతీ తలపై రూ.162 చొప్పున సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్‌లు కేటాయిస్తాయి. ఆయా గ్రామాల జనాభా లెక్కన గ్రాంటును విడుదల చేస్తుంటారు. కాగా, సుమారు 22 నెలల నుంచి స్టేట్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంట్ నిలిపివేయడంతో పంచాయతీల్లో పనులు చేయించడం కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంటు మూణ్ణెళ్లకోసారి వస్తుండటంతో అప్పటికే గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లు కుప్పగా తయారవుతోంది. మిగిలేది ఏమీలేక మిగతా ఖర్చులకు కార్యదర్శి జేబులో నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మల్టీపర్పస్ వర్కర్స్‌కు అందని వేతనాలు

గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా ఆధారంగా మల్టీపర్పస్ వర్కర్స్‌ను గత ప్రభుత్వం నియమించింది. 500 జనాభాకు ఒక్కరు చొప్పున విధుల్లోకి తీసుకుంది. అయితే వీరికి గ్రామపంచాయతీ నుంచి వచ్చే ఆదాయం నుంచే ఒక్కొక్కరికి నెలకు రూ.9,500 జీతాలు చెల్లించాలని జీవో జారీ చేసింది. యేడాదికోసారి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం గ్రామ అవసరాలకే సరిపోక మల్టీపర్పస్ వర్కర్స్ మూడు, నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవత్వం ఉన్న కార్యదర్శులు ఖర్చులో ఖర్చుంటూ అక్కడక్కడా వర్కర్స్‌కు చేతనైనంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్నారు.

కార్యదర్శులకు యాప్‌ను తొలిగించాలి..

జె. అశోక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

ప్రతీరోజు గ్రామంలోని నర్సరీ, శ్మశానవాటిక, చేత్త సేకరణ లాంటి 10 అంశాలకు సంబంధించి ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు. యాప్‌ను తొలిగించాలి. కారోబార్‌లను మల్టీపర్పస్ వర్కర్స్‌లో చేర్చడం వల్ల సుమారు 65 రికార్డ్‌లను నిర్వహించడం కష్టంగా ఉంది. కారోబార్లను కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి. పంచాయతీల అవసరాలకు సరిపడా నిధులులేక జేబుల్లో నుంచి పెట్టుబడి పెట్టి ఆర్థికంగా కుంగిపోతున్నాం. ఆ సమస్యను పరిష్కరించాలి.

కొనుగోళ్లలో అక్రమాలను సహించం



మార్కెట్‌లో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దళారులను హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం ఆయన సందర్శించి రైతులు, అధికారులతో మాట్లాడారు. మార్కెట్‌లో బుధవారం జరిగిన ఘటనలు పునరావృతం కావొద్దని అధికారులకు సూచించారు. ఆయన వెంట పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి భవానీరెడ్డి, నాయకులు పిన్నింటి నారాయణరెడ్డి, బనుక శివరాజ్‌యాదవ్, లక్ష్మారెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్ ఉన్నారు.

'మార్కెట్‌లో కొనుగోళ్లు బంద్ చేయాలి'

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ట్రేడర్లపై పెట్టిన కేసులు, మార్కెట్‌లో హమాలీల సమస్య తేలే వరకు కొనుగోళ్లు బంద్ చేయాలని జనగామ ఎగుమతి, ఆహారధాన్యాల ఖరీదుదారుల సంఘం(ట్రేడర్లు) అధ్యక్షుడు నాగబండి రవీందర్ కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు చేసిన తీర్మాన కాపీని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌కు రైతులు పచ్చిధాన్యం తీసుకొస్తున్నారని, తేమ శాతం ఆధారంగానే రేటు నిర్ణయించి కొంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తమపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదన్నారు. కేసుల విషయం, హమాలీల సమస్య తేలే వరకు కొనుగోళ్లు బంద్ చేయాలని కోరారు. కాగా.. దీనిపై మార్కెటింగ్ అధికారి నరేంద్ర మాట్లాడుతూ ట్రేడర్లు ముందుకు రాని పక్షంలో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి రైతులు వెళ్లాలని సూచించారు. ట్రేడర్లు ఇచ్చిన నోటీసు విషయాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు రైతులు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్లి విక్రయించాలని సూచించారు.

ఆలయానికి వెండి నక్షత్ర హారతి బహూకరణ



సోమేశ్వరాలయం ఈవోకు నక్షత్ర హారతిని అందచేస్తున్న భక్తులు

పాలకుర్తి, ఏప్రిల్ 11 : శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పాలకుర్తికి చెందిన భక్తులు రూ.53 వేలు విలువ గల 665 గ్రాముల వెండి నక్షత్ర హారతిని ఆలయ ఈవో లక్ష్మీప్రసన్నకు గురువారం అందచేశారు. పాలకుర్తికి చెందిన రాపాక సోమన్న, పారిజాతం వారి కుమారులు సందీప్, పృధ్వీరాజ్ స్వామి వారికి అందచేసి మొక్కులు చెల్లించారు. శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి తమ ఇలవేల్పు దైవమని అన్నారు. కార్యక్రమంలో పూజారి దేవగిరి అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు ప్రాధాన్యం

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర



శివునిపల్లిలో ఇందిరను సన్మానిస్తున్న ముస్లిం కుటుంబ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. గురువారం రంజాన్ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ మండల ఇంచార్జీ జానీపాషా ఇంటికి వెళ్లి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు యోగక్షేమాలతో ఉండాలని అల్లాని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిరీష్ రెడ్డి, జగదీష్‌చందర్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, కాసాని బొందయ్య, మల్లేషం, సమ్మయ్య పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాలకుర్తి ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న సీఐ మహేందర్‌రెడ్డి



కామారెడ్డిగూడెం ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు

- షవ్వాల్ నెలవంకతో ముగిసిన ఉపవాస దీక్షలు
- మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- పరస్పర ఆలింగనాలు... శుభాకాంక్షల వెల్లువ

జఫర్‌గడ్, ఏప్రిల్ 11: కఠిన ఉపవాస దీక్షలు.. భక్తిశ్రద్ధలతో నమాజులు.. దానధర్మాలు.. ఇఫ్తార్ విందులతో సాగిన రంజాన్ మాసం ముగిసింది. మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ వేడుకలను గురువారం జఫర్‌గడ్ మండలంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున ఫజర్ నమాజ్‌ను ఆచరించారు. కొత్త దుస్తులు ధరించి జామా మసీదుకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక తక్బీర్‌ను పఠిస్తూ గ్రామ చివర గల ఈద్గా వద్దకు వెళ్లారు. అక్కడ సమస్త మానవాళి శాంతిసౌఖ్యాలు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా 'అల్లాహు అక్బర్ - అల్లాహు అక్బర్ - లా ఇలాహ ఇల్లల్లాహు - అల్లాహు అక్బర్ - అల్లాహు అక్బర్ - విల్లల్లాహిల్ హమ్ద్' అని ప్రార్థిస్తూ ఈద్గాలో రెండు రకాత్‌ల ప్రత్యేక నమాజ్‌ను ఆచరించారు. మత గురువుల ధార్మిక ఉపన్యాసం అనంతరం జామా మసీదులో అల్లాహ్‌ను స్తుతిస్తూ నమాజ్ చేశారు. ఆ తరువాత పరస్పర పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే హిందువులు ముస్లింలను కలిసి 'ఈద్ ముబారక్' అంటూ అలింగనం చేసుకుని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో రంజాన్ వేడుకలు ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. పేదలకు వస్త్ర, వస్తు దానాలు చేశారు. 30 రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు దీక్షల ముగింపు సందర్భంగా హిందువులను కలుసుకుని ఆలింగనం చేసుకున్నారు. గన్ను శ్రీనివాస్ దంపతులు పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

రఘునాథపల్లి: మండలంలో రంజాన్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మదీనా మజీద్ అధ్యక్షుడు బషీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి రఫీ, బాషుమియా, ఇమామ్ రిజ్వాన్ అహ్మద్, దస్తగిరి, జహంగీర్, అఫ్జల్, సాదిక్ అలీనవాబ్, సర్వర్ మియా, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు జడ్పీటీసీ బొల్లం అజయ్ మణికంఠ, ఎంపీపీ మేకల వరలక్ష్మినరేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

పాలకుర్తి: మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కొత్త దుస్తులు ధరించి ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ అంటూ అలాయి బలాయి చేసుకున్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, ముస్లిం నాయకులు వహీద్, మదార్, రాజ్‌మహమ్మద్, సాహెబ్ హుస్సేన్, సలీం, సర్వార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ జామా మసీద్ ఆధ్వర్యంలో మతపెద్ద మొహమ్మద్ బషీరుద్దీన్ నేతృత్వంలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు గులామ్ గౌస్, ఎండీ షన్ను, నవాజ్, ఆసిఫ్, జబ్బార్, సరకష రాజ్, సర్వర్, అజాం, హమీద్, ముజీబ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కామారెడ్డిగూడెం ఈద్గా వద్ద మతపెద్ద ఇనాయత్‌అలీ ప్రత్యేక ప్రార్థన చేయించారు. కడవెండి, సీర్మాల, దేవరుప్పుల, దాదాసాహెబ్, కోలుకొండ మశీదులలో ప్రత్యేకంగా నమాజు చేశారు. అనంతరం హిందు, ముస్లిం తేడా లేకుండా అలాయి బలాయి తీసుకున్నారు. ముస్లింలకు హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గులాం రసూల్, జాకీర్ హుస్సేన్, షబ్బీర్‌అలీ, రాజమహ్మద్, యాఖూబ్ పాషా, అఫ్జల్, మజర్, మొగులానా, అబ్బాస్, ఖాజా పాల్గొన్నారు.

నర్మెట: రంజాన్ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎమ్డీ గౌస్‌కు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

తరిగొప్పుల: రంజాన్ సందర్భంగా అన్ని గ్రామాల్లో ముస్లింలు ఉదయం నుంచే ఈద్గాల వద్దకు చేరుకుని ఒకరికొకరు ఆలింగం చేసకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులు సైతం వారికి శుభాకాంక్షలు తెలుపుతూ మతసామరస్యాన్ని చాటుకున్నారు.

చిలుపూర్: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటామని ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు ఎమ్డీ యాకూబ్ పాషా అన్నారు. గురువారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాజవరం మజీదులో జరిగిన ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలతో కలిసి అలాయ్ బలాయ్ తీసుకున్నారు. అలాగే చిలుపూర్, వెంకటాద్రిపేట తదితర గ్రామాల్లో జరిగిన రంజాన్ వేడుకలకు ఖాను సీడ్స్ ప్రతినిధి ఎమ్డీ షకీల్ అహ్మద్‌తో పాటు, ఎస్‌కే రహీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎండి అసద్, యాకూబ్, ఎండి అన్వర్, అక్బర్, షరీఫ్, సుకూర్, నజీర్, అక్రమ, అనీఫ్, ఎండి హుస్సేన్, సుఫాన్, ఉస్మాన్, ఫెరోజ్, జావీద్, గౌస్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో రంజాన్ వేడుకలు గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా మైదాన్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ ప్రవచనాలు వినిపించారు. ముస్లింలకు హిందువులు శుభాకాంక్షలు తెలిపారు.

లింగాలఘనపురం: మండలవ్యాప్తంగా గురువారం రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ముస్లింలు నూతన వస్త్రాలు దరించి ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు వినోదాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీ-ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నివాళులు అర్పిస్తున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



పాలకుర్తిలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద ఓబీసీ నాయకుల నివాళి

పూలే గొప్ప సంఘ సంస్కర్త

జయంతి వేడుకల్లో కొనియాడిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 11: విద్యా విలువను సమాజానికి చాటిచెప్పిన గొప్ప మహోన్నత వ్యక్తి జ్యోతిరావుపూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్ అన్నారు. జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అంటే కేవలం చదువడం, రాయడం మాత్రమే కాదని సామాజిక స్పృహను పెంపొందించుకోవడమని చాటిచెప్పిన వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బోసు ఐలయ్య, కొలిపాక రవి, లక్ష్మయ్య, రాకేష్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: అఖండ భారత అక్షర జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల సుధాకర్ అన్నారు. మండలంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి జేరిపోతుల సుధాకర్, ఎంఎస్‌పి మండల ఇన్‌చార్జి దర్శనాల రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రాంచందర్, నాయకులు ఉమ్మగోని నర్సయ్య, కొంరెల్లి, అరూరి శ్రీనివాస్, కొడిదేటి కుమార్, మచ్చ అబ్బయ్య, రంగు శ్రీనివాస్, తాళ్లపల్లి ఎల్లయ్య, సురేందర్, కడారి ఐలయ్య, ఉదయ్ కిరణ్, విక్రమ్, దయాకర్, ప్రణయ్, సౌష్టవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఓబీసీ, సీపీఎం, బీజేపీ బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన పులి గణేష్, రాపాక సత్యనారాయణ, చిట్యాల సోమన్న, గుమ్మడిరాజు సాంబయ్య మాట్లాడుతూ ఆనాడే బ్రాహ్మణ సమాజాన్ని వ్యతిరేకించిన గొప్ప నాయకుడు పూలే అని అన్నారు. కార్యక్రమంలో జలగం కుమార్, మాజీ ఎంపీపీ గడ్డం యాకసోమయ్య, పెనుగొండ రమేష్, భాస్కర్, సలేంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: మండలకేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో మహత్మ జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపడానికి ఎనలేని కృషి చేసిన సమతావాది పూలే అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ గౌస్, నాయకులు ఎనుగుల వెలంగిణి, నక్కల రవి, సదానందం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: అణగారిన కులాల ఆశాజ్యోతి, పీడితుల పక్షాన పోరాడిన మహానేత మహత్మ జ్యోతిరావు పూలే అని ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, ప్రజాసంఘాల నేతలు పైస రాజశేఖర్, అల్వాల నర్సింగరావు, మల్యాల బాల్‌నర్సయ్య అన్నారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి త్యాగాలను కొనియాడారు. సత్యశోధక్‌ను స్థాపించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన నేత పూలే అని అన్నారు. వెనుకబడిన వర్గాలకు అండగా నిలవటంతో పాటు, మహిళల చదువు కోసం నిత్యం పరితపించి, విజయం సాధించిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో తేలుకంటి శ్రీనివాస్, అనిల్, కుమారస్వామి, రాజేశ్ పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

దేవరుప్పుల, ఏప్రిల్ 11: జనగామ-సూర్యాపేట రహదారిపై దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం తరలించకుండా ఆయన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఎస్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులతో ఆయన వేర్వేరుగా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున పటిష్ఠంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దేవరుప్పుల ఎస్సై చెన్నకేశవులు, హెడ్‌కానిస్టేబుల్స్ శ్రీనివాస్, సదయ్య, శ్యాంసుందర్, కానిస్టేబుల్స్ అశోక్, భాస్కర్, యాకేష్, 1-2 సెక్షన్ జి కంపెనీ 39వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో గురువారం సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వాహనాలను తనిఖీ చేస్తున్నామని, వాహనదారులు తమ వెంట ధృవీకరణ పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని, వాహనాల్లో డబ్బు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, సిబ్బంది వీరన్న, మహేందర్, యాదగిరి, ఇంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరుప్పుల, ఏప్రిల్ 11: పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు, హంస అవార్డు గ్రహీత, కళారత్న గడ్డం సమ్మయ్యను గురువారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించి సత్కరించారు. కిన్నెర ఆర్ట్స్ 47వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో శ్రీ క్రోధి నామ ఉగాది పురస్కారాలు ఘనంగా జరుగగా సమ్మయ్యను పిలిపించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ రమణాచారి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం



108 అంబులెన్స్‌లో ప్రసవించిన ధర్మగడ్డతండాకు చెందిన మూడ ప్రవళ్లిక

దేవరుప్పుల, ఏప్రిల్ 11: మండలంలోని ధర్మగడ్డతండాకు చెందిన మహిళ మూడ ప్రవళ్లికకు గురువారం పురిటినొప్పులు రావటంతో కుటుంబసభ్యులు 108అంబులెన్స్‌ను పిలిపించారు. జనగామ పట్టణంలోని మాతా ఆరోగ్య శిశు కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నెల్లుట్ల బ్రిడ్జి వద్ద నొప్పులు ఎక్కువ కావటంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది ప్రసవం చేయించారు. ప్రవళ్లిక మగ బిడ్డకు జన్మనివ్వగా ఆ తర్వాత తల్లీ బిడ్డను ఎంసీహెచ్‌కు తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో సిబ్బందిని దేవరుప్పుల జడ్పీటీసీ పల్లా భార్గవి, ఎంపీపీ బస్వ సావిత్రి అభినందించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ఈఎంటీ బిల్లా రాజిరెడ్డి, పైలాట్ ఎం. రమేష్ పాల్గొన్నారు.

15న నవగ్రహ ప్రతిష్ఠ

కొడకండ్ల, ఏప్రిల్ 11: మండలంలోని ఏడునూతుల గ్రామంలో ఈ నెల 15న నవగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు కార్య నిర్వాహకుడు పాము లక్ష్మీనారాయణ తెలిపారు. 13న ఉదయం నిత్యారాధన, బాలబోగం, విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నెల్లుట్ల సుధాకర్‌రావు - కరుణ దంపతులు నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రతిష్ఠ రోజే ప్రారంభిస్తారని ఆయన వివరించారు.

బండనాగారంలో రెండు నెమళ్ల మృతి



బండనాగారంలో మృతి చెందిన నెమళ్లు

బచ్చన్నపేట, ఏప్రిల్ 11: ఎండవేడి భరించలేకనో.. వేటగాళ్ల ఉచ్చుకు బలై ఉంటాయో తెలీదు కాని మండలంలోని బండనాగారం గ్రామంలో చింతగున్న పానాదిలో కుమ్మరి సూరయ్య ఏనెవద్ద రెండు నెమళ్లు గురువారం మృత్యువాత పడ్డాయి. అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో పక్షులకు నీళ్లు దొరక్క వడదెబ్బకు గురై చనిపోయి ఉంటాయా అనే అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. వరిచేలు కోతదశకు రావటంతో రైతులు పంటపొలాలకు నీటి తడులను నిలిపివేస్తున్నారు. దీంతో నెమళ్లతో పాటు పలు పక్షులకు, అటవీ జంతువులకు నీరు లభించటం లేదు. దీంతో అవి మృత్యుబారిన పడుతున్నాయి. కాగా ఇటీవల వేటగాళ్లు నెమళ్లను పట్టేందుకు ఉచ్చులు బిగిస్తున్నారని, మత్తుగొలిపే పదార్థాలు చల్లి అవి అపస్మారక స్థితిలోకి వెళ్లగానే పట్టుకుపోతున్నారని రైతులు చెబుతున్నారు. బండనాగారంలో నెమళ్లు మృతి చెందటానికి కారణమేమై ఉంటుందనే దానిపై అధికారులు విచారణ జరిపితే తేలనుంది.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

బచ్చన్నపేట, ఏప్రిల్ 11: జిల్లాలో ఎండిన వరిపంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఎకరానికి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయాయన్నారు. ఎకరాకు రూ.30 వేలు పరిహారం చెల్లించాలన్నారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందించాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, రామగళ్ల అశోక్, భైరగోని బలరాం, తాడెం రాములు, నర్సింహులు పాల్గొన్నారు.

స్నేహితుడు కోలుకోవాలని..

వైద్య ఖర్చులకు రూ. 40 వేలు అందజేసిన బాల్య మిత్రులు



స్నేహితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

బచ్చన్నపేట, ఏప్రిల్ 11: తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యం బారిన పడి మంచం దిగలేని పరిస్థితిలో ఉండగా, అతనితో పాటు కలిసి చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు చేయూతనిచ్చి పలువురికి మార్గదర్శకంగా నిలిచారు. మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన రాసూరి బీరప్ప అనారోగ్యానికి గురికాగా, విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు, 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.40 వేలు జమచేసుకుని అందించారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కలిసి చదువుకున్న స్నేహితులు 40 ఏళ్ల తరువాత కూడా తమలో ఒకరికి ఆపద వస్తే స్పందిస్తున్న తీరు అనేక మందికి మార్గదర్శకంగా ఉందని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో తేలుకంటి మురళి, బొమ్మెన కేశవర్ధన్, బాస్కరుని పృథ్వీరాజ్, యాదగిరి, రాములు, సుధాకర్‌రెడ్డి, వేణు, రవిచంద్ర, సత్యనారాయణ, రాజమౌళి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



లక్ష్మీ(ఫైల్)

జఫర్‌గడ్, ఏప్రిల్ 11: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జఫర్‌గడ్‌కు చెందిన సంగ లక్ష్మీ (75) అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. లక్ష్మీ గత మార్చి 21న రాత్రి ఇంట్లో దేవునికి హారతి ఇస్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు చీరకు నిప్పంటుకుని మంటలు లేచి శరీరంపై గాయాలయ్యాయి. ఆమెను ఆదే రోజున వరంగల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి చనిపోయినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. ఆమెకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.